❖•❖•❖ 18 ❖•❖•❖

# యేసు చేసిన నేరములు

*"వారు కయపయొద్దనుండి అధికారమందిరమునకు యేసును తీసికొనిపోయిరి. అప్పుడు ఉదయమాయెను; గనుక వారు మైలపడకుండ పస్కాను భుజింపవలెనని అధికారమందిరములోనికి వెళ్లలేదు. కావున పిలాతు బయట ఉన్నవారియొద్దకు వచ్చి – ఈ మనుష్యునిమీద మీరు ఏ నేరము మోపుచున్నారనెను" (యోహాను 18:28, 29).*

ఉదయమైనప్పుడు, యేసు రోమా ప్రభుత్వాధికారియైన పిలాతు వద్దకు తీసికొనిపోబడ్డాడు. అన్న, కయప మరియు యూదుల మహా సభవారు యేసును ఏమిచేయవలెనో అదివరకే తీర్మానించుకొన్నారు. ఆయన దేవదూషణ చేశాడని చెప్పువిషయములోను ఆయన సిలువ మరణమునొందవలసినదే అను తుది అభిప్రాయముకు వచ్చుట గూర్చియు వారందరు ఏకమయ్యారు (మత్తయి 26:66). తరువాత, వారు ఆయనను రోమా ప్రభుత్వాధికారి యొద్దకు తీసికొని వెళ్లవలసివచ్చినది. వారు తీర్పు తీర్చిన విధముగానే పిలాతు తీర్పు కూడా ఉండునట్లును తద్వారా యేసుకు మరణదండన విధింపబడునట్లును పిలాతును ఒప్పించవలెనని ఆశించి ఆందుకు అనువైన వివరమును పిలాతుకు నివేదించగలరని వారాశించారు.

ఉదయకాల సమయమును చేజిక్కించుకొని, పిలాతు యేసును ప్రశ్నించుచు విచారించునట్లు వారు యేసును అతని యొద్దకు తీసికొనివెళ్లారు. వారికి ఎక్కువ సమయము మిగిలే సూచనలు కనిపించుట లేదు. ఏలయనగా పగటి సమయము గడిచిపోగానే పస్కాభోజన సందర్భమును పాటించాల్సిన సమయమాసన్నమౌతుంది గనుక వారు త్వరపడవలసి వచ్చినది. శుక్రవారము ఉదయమే యేసుకు మరణదండన విధింపబడునట్లు వారు ప్రయాసపడకపోయినట్లయితే, ఆయన మరణదండన కొరకైన వారి సదవకాశమును వారు కోల్పోయినట్లే అవుతుంది. సరికదా పస్కా భోజన సమయము గడిచిపోయిన తరువాత కూడా యేసు వారిచేత బంధింపబడి యున్నట్లయితే, యేసుకు విరోధముగా వారు ఆశించుచుండిన తీర్పు తీర్చబడుటకు మరి ఎక్కువ కష్టమగును.

అర్ఖిలెయస్, మహా హేరోదు యొక్క వారసుడు, దేశము నుండి గౌల్‌నకు క్రీ.శ. 6లో బహిష్కరింపబడినప్పుడు, ఆయన పరిపాలించుచుండిన భూభాగము – యూదయ, సమరయ, మరియు ఇదూమియ – అంతా ఒక ప్రదేశముగా చేయబడి సామ్రాజ్య రోమా ప్రభుత్వ ప్రతినిధి, లేక ప్రభుత్వాధిగారి పాలనలో ఉంచబడినది. ఈ ప్రదేశమును పాలించు ఇటువంటి వారిలో పిలాతు ఐదవ వాడు. యేసు తీర్పునకు మునుపు పిలాతు ఈ అధికారములో ఆరు సంవత్సరములుండెను. క్రీ.శ. 26లో నియామకము చేయబడి, అదే అధికారములో యింకా నాలుగు సంవత్సరములు, క్రీ.శ. 36లో గద్దె దింపబడినంతవరకు ఉండెను. ఈ సమయములో సహితము, అతడు యూదులతోను రోమా ప్రభుత్వముతోను కలిగియుండిన సంబంధము సంకటములో ఉండెను. అతని క్రూరత్వమునుబట్టియు నీచ నాయకత్వమునుబట్టియు, రోమా ప్రభుత్వము అతనికి మారుగా మరొకరిని నియమించుటకు సిద్ధముగా నుండెను – యూదులు అతనిని ఎందుకూ పనికిరానివాడని ఎంచారు. అప్పుడప్పుడు, కొందరు యూదుల రక్తమును దేవాలయములో వారర్పించుచుండిన బల్యర్పణలతో కలుపుచు కూడా, అతడు వారి యెడల క్రూరముగా ప్రవర్తించాడు (లూకా 13:1). అతడు రోమా ప్రభుత్వముతోను యూదులతోను కలిగియుండిన సంబంధము బలహీనపడుచు తిరోగతి చెందుచుండినందువలన వివాదాస్పదమైన బందీకి న్యాయసమ్మతమైన తీర్పు తీర్పుట కంటె శాంతియుత వాతావరణమును నెలకొల్పవలసిన ఆందోళనకరమైన ఒత్తిడి అతనిపై అధికమయ్యింది.

రోమా ప్రభుత్వాధికారి పస్కాపండుగ వంటి ఒక పెద్ద విందు సమయములో యెరూషలేములో ఉండుట ప్రధానాంశముగా చేసికొని అందుకు అవసరమైన ఏర్పాట్లన్ని

చేసికొన్నాడు. ఆ పండుగ సమయములో ప్రజల సంఖ్య అత్యధికంగా పెరుగుతుంది, పస్కా గొఱ్ఱెపిల్లను వధించి పులియని రొట్టెల వారమును ఆచరింటుటకు పరిశుద్ధ పట్టణములో కూడుకొను సందర్శకులు భారీ ఎత్తున వచ్చుట వలన, బహుశ రెట్టింపు కావచ్చును లేక మూడంతలకు కూడా పెరగవచ్చును. ఇంతటి మహత్తరమైన యూదుల కూడికలో, అల్లరులు లేక ఏదో ఒక విధమైన తిరుగుబాటు చెలరేగుటకు అవకాశములు ఎల్లప్పుడూ మెండుగానే ఉండునని పిలాతు ముందుగా ఎరిగియుండెను. కాబట్టి, అతడు కైసరయ నుండి సహాయక సైన్యముతో ప్రయాణమై వచ్చి అంతోనియ అని పిలువబడు దుర్గములో, దేవాలయమునకు సమీపములో నుండిన రాజభవనము వంటి కోటలో, బసచేయును. అతడు ఎల్లప్పుడు అక్కడనే సిద్ధపడి ఉంటూ, ఎటువంటి సమస్య తలెత్తినా దానిని ఎదుర్కొనుటకు సంసిద్ధముగా ఉండునని భావింపబడినది.

యేసు భరించవలసి యుండిన రోమా ప్రభుత్వ తీర్పు నిమిత్తము పిలాతు నొద్దకు తీసికొనిరాబడినప్పుడు, ఆయన ఒక సింహాద్వారము గుండా పిలాతు బసచేయుచుండిన రాజభవనమునకు ఎదురుగా వెలుపట బహిరంగముగా గచ్చు నేల ఉండిన చోటికి తీసికొనిపోబడ్డాడు. ఇదొక ప్రత్యేక ఏర్పాటై యుండినది, ఏలయనగా సర్వసాధారణముగా ఇటువంటి తీర్పు రాజభవనము యొక్క రెండు విభాగముల నడుమ నుండు బహిరంగ, జనసామాన్య స్థలములో నిర్వహింపబడినది. రాజకీయ ఆసనము, ఊదారంగు గల బట్టలు పరువబడి, బయటికి మోసికొని తేబడినది. పిలాతు దాని మీద ఆసీనుడై, నిందితునిపై మోపబడిన నేరముల వివరములను విన్న తరువాత, తీర్పును ప్రకటించును. నిందితుడు అతని ముందర నిలువబడియుండగా సాక్షులు నిందితునికి యిరు వైపుల లేదా ఒక గుంపుగా అతనికి ఒక ప్రక్కలో నిలువబడి యుందురు. రోమా సామ్రాజ్య ప్రభుత్వ ప్రతినిధిగా, పిలాతు తన ఆసనముపై ఆసీనుడై ప్రశ్నోత్తరములను ప్రారంభించాడు. ఈ ప్రక్రియ ముగిసిన తరువాత, అతడు తన తీర్పును ప్రకటించాడు. ఈ వ్యవహారమంతా ప్రజా వేదిక నిర్వహింపబడు రీతిలో నిర్వహింపబడినది.

యేసు తీర్పు నిమిత్తము, యూదుల మహా సభవారు అతనిని చూడగోరుచున్నారనియు వారిని కలుసుకొనుటకు అతడు సిద్ధముగా నుండవలెననియు, పిలాతుకు సమాచారమందించబడి యుండును. యోహాను వ్రాయుచున్నట్లుగా, వారు శిష్టాచారరీత్యా మలినమైనవారై పస్కా విందులో పాల్గొనలేరు గనుక మహా సభ సభ్యులు ప్రేతోర్యమను అధికారమందిరములోనికి వెళ్లుటకు ఆశించలేదని, బహుశ పిలాతు ఎరిగియుండెను (యోహాను 18:28). కాబట్టి, ప్రధాన యాజకులు యేసును పిలాతు నొద్దకు తీసికొనివచ్చినప్పుడు, వారిని కలిసికొనుటకు అతడు అప్పటికే ప్రేతోర్యమను అధికారమందిరము వెలుపట ఉండెను. పిలాతు యేసుతో ఒంటరిగా, కలకలమునకు దూరముగా, మాట్లాడుటకు ఆయనను అప్పుడప్పుడు లోనికి వెళ్లినప్పటికిని, యేసు తీర్పు ప్రాథమికముగా బహిరంగముగా గచ్చుగల నేలయుండిన స్థలములో నిర్వహింపబడినది.

యూదులు యేసును తీసికొని వచ్చినప్పుడు, నిందితునిపై మోపబడుచుండిన నేరముల జాబితా మొదట ఇవ్వవలెనని పిలాతు అడిగాడు. ఆయన, "ఈ మనుష్యునిమీద మీరు ఏ నేరము మోపుచున్నారు?" అని అడిగాడు (యోహాను 18:29). గనుక ఈ ప్రధాన యాజకులు వారి రుజువును నివేదించి యేసుకు విరోధముగా న్యాయసమ్మతమైన నేరమును తెలియజెప్పవలసి

యుండెను. ఈ వాక్య భాగమును మొదటిసారి చదువువారు, "ఇప్పుడు అసలు సత్యము బయటపడుతుంది!" అని అనుకొనవచ్చును. యేసు ఏదైన నేరము చేశాడని చెప్పుటకు వీరి యొద్ద ఎటువంటి రుజువైనను లేకుండినది. వీరు ఏ రకమైన న్యాయాధిపతులు? అది ఎవరో కొందరి చేత ఏర్పడిన ఒక అనధికారిక న్యాయస్థానమా లేక ఒక నిజమైన న్యాయసభ గల న్యాయస్థానమా? వారు తమ ఆరోపణను నివేదించుటలో, అవసరమై యుండిన రుజువేమీ లేనందువలన ఏమి చెప్పవలెనో తెలియక యూదులు తికమకపడ్డారు.

*నిరాశ వలన కలిగిన తెగింపుతో, వారు మొదట "మా మాటలు నమ్మి తీర్పు చెప్పండి" అని అడిగారు.* వారు, "వీడు దుర్మార్గుడు కానియెడల వీనిని నీకు అప్పగించియుండము" అని పిలాతుతో అన్నారు (యోహాను 18:30). "రుజువు సంగతి మనము మర్చిపోదాము ఈ విషయములో మేము ఎప్పుడో తీర్పునిచ్చాము. గనుక మీరు కేవలము మా తీర్పుకు ఆలంబనమిచ్చి ఇతడు సిలువమరణము నొందవలెనని తీర్పునివ్వండి,అంతే చాలు!" అనునది వారి వాదమై యుండెను.

అయితే ఈ విధమైన వారి వాదన పనిచేయలేదు; పిలాతు వారి కపట పన్నాగములో చిక్కుకొనలేదు. ఆయన "మీరతని తీసికొనిపోయి మీ ధర్మశాస్త్రముచొప్పున అతనికి తీర్పు తీర్చుడి" అని వారితో అన్నాడు (యోహాను 18:31ఎ). అనగా "అసలు మీరు నాదగ్గరకు ఎందుకు వచ్చారు? ఈ విషయములో నేను కూడా పాల్గొనువాడను కానట్లయితే, మీరే చూచుకొనండి. రోమా ప్రభుత్వ చట్ట ప్రకారము నేను ఇతనికి తీర్పు తీర్చలేనట్లయితే, మీరు మీ యూదా ధర్మశాస్త్రము ప్రకారము తీర్పు తీర్చండి" అని చెప్పాడని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. పిలాతు ప్రతిస్పందనకు వారు, "ఎవనికిని మరణశిక్ష విధించుటకు మాకు అధికారము లేదు" అని బలవంతముగా చెప్పవలసివచ్చినది (యోహాను 18:31బి). వారు, "లేరు, మీరు లేకుండా మేము ఈ పని చేయలేము" అని జవాబిచ్చారు. వారి తీర్పుతో ఏకీభవించు పిలాతు తీర్పు వారికి అవసరమని వారంగీకరించునట్లు తమ్మునుతాము తగ్గించుకొనవలసి వచ్చినది, కానీ వారు వారనుకొన్న ప్రకారము పిలాతు తీర్పును అనుకూలపర్చుకొను నిమిత్తము ముందడగు వేయుటను బట్టి తొట్రిల్లినందువలన వారి స్వాతిశయమును ఒదులుకొనవలసి వచ్చినది. పిలాతు, "సరే, అలాగైతే, నేను ఈ విషయములో రోమా ప్రభుత్వ ఇష్టప్రకారము వ్యవహరిస్తాను, మీ ఇష్టప్రకారము కాదు" అని చెప్పవలసి యుండెను. ఈ విధముగా పరస్పర భావములను తెలిసికొన్న కొంతసేపటికి, పిలాతు యేసును లోనికి తీసికొనివెళ్లి ఆయనను ఒంటరిగా ప్రశ్నించాడు.

*తీర్పు జరుగుచుండిన ఈ సమయములో, నేరారోపణలలోని ఒక విధమైన ప్రకటనగా, యేసు ప్రజలలో నీతి బాహ్యామైన చర్యలు పురిగొల్పు వాడనియు ప్రజలను తప్పుడు ప్రయోజనాలకై ప్రలోభపెట్టువాడనియు వారు కేకలు వేశారు.* బహుశ ఆయన యేసును రోమా ప్రభుత్వ చట్ట ప్రకారము ప్రశ్నించి తీర్పునిచ్చెదనని లేదా తీర్పు తీర్చనని పిలాతు ప్రకటన చేసిన తరువాత అయియ్యుండవచ్చును, యూదులలో అనేకులు, "ఇతడు మా జనమును తిరుగబడ ప్రేరేపించుచు ..."; "ఇతడు గలిలయదేశము మొదలుకొని ఇంతవరకును యూదయాదేశమందంతట ఉపదేశించుచు, ప్రజలను రేపుచున్నాడు" అని కేకలు వేశారు (లూకా 23:2ఎ; 5బి). దోషనిర్ధారణను సంపాదించుకొనుటకు, యూదుల మహాసభవారు మోపబడిన నేరములకు వారిచ్చిన తీర్పును మార్చవలసి వచ్చినది. ఈ ఉన్నతమైనదియు

పవిత్రమైనదియునైన యూదుల న్యాయస్థానము ఆయన దేవుని కుమారుడని స్వాధికారముతో చెప్పాడు గనుక యేసు మరణించవలసినదేనని అదివరకే ఒక తీర్పు నిచ్చినది, కానీ పిలాతు యెదుట వారు యేసుకు విరోధముగా రోమా ప్రభుత్వమును ఆయన ధిక్కరించాడని గుర్తించునట్లు ఏదో ఒక నేరమును మోపవలసివచ్చినది. దైవత్వము గూర్చి ఆయన స్వాధికారముతో చెప్పిన విషయము రోమా ప్రభుత్వమునకు సంబంధించినది కాదు; కాబట్టి, వారు వేగిరముగా ఆయన గూర్చి వారికి తెలిసిన దానిని వక్రీకరించి ఆయన తొందరలు సృష్టించువాడుగాను, ప్రజలను మోసముచేయుచున్న వాడుగాను, ప్రజలు అల్లర్లు చేయునట్లు పురికొల్పినవాడుగాను అగుపించునట్లు చేశారు.

ఔను, ప్రజలు బాప్తిస్మమిచ్చు యోహాను బోధలు వినుటకు వెళ్లినట్లుగా యేసు బోధలు కూడ వినుటకు వారు తండోపదండాలుగా వెళ్లారని సువార్తలు దృవీకరించుచున్నవి. ఏది ఏమైనా, యేసు ఎన్నడును అల్లరులను పురికొల్పలేదు లేదా ఎటువంటి రాజకీయ అరాచకమును సృష్టించనూ లేదు. ఇది అపనింద అని పిలాతు అర్థము చేసుకొన్నాడు.

*అంతమాత్రమేగాక, యేసుకు విరోధముగా నేరములను కల్పించుటకు వారు కొనసాగుచుండగా, కైసరుకు పన్నియ్యవద్దని యేసు ప్రజలకు ప్రబోధించాడని వారు పిలాతుతో చెప్పారు.* యేసు ప్రజలను ప్రలోభపెట్టువాడని నేరము మోపబడిన అదే కోవలో, వారు ఈ దోషారోపణను కూడా తెలియజెప్పారు. మాటలాడుటకు మొదలుపెట్టి క్షణమాత్రమైనా తెరిపినియ్యక కేకలు వేయుచు, ఏ విధమైన వాస్తవములు లేని నేరారోపణ చేయుచుండిన అరుపులతో, వారు, “కైసరుకు పన్నియ్యవద్దనియు … చెప్పాగా మేము వింటిమి” అని పలికారు (లూకా 23:2ఎ, బి). ఈ ఆరోపణ స్పష్టంగాను పూర్తిగాను అనుచితమైనది. అది శుద్ధ అబద్ధం.

కైసరుకు పన్నిచ్చు విషయమై ఆయనను అడిగినప్పుడు, యేసు దాని గూర్చి ప్రస్తావించిన మాట నిజమే, కానీ యేసు చెప్పిన సమాధానము వారు ఆరోపణ చేయుచుండిన దానికి పూర్తిగా భిన్నముగా ఉండినది. మత్తయి 22వ ఆధ్యాయంలో వ్రాయబడియున్న విధముగా ఈ సందర్భమును పునఃపరిశీలించుము. యేసు, “పన్ను రూక యొకటి నాకు చూపుడి” అని చెప్పాడు. వారిలో ఒకడు ఒక దేనారము తెచ్చి ఆయనకిచ్చాడు. అప్పుడాయన, “ఈ రూపమును పైవ్రాతయు ఎవరివి?” అని అడిగాడు. అందుకు వారు, “కైసరువి” అని బదులు పలికారు. అప్పుడాయన, “ఆలాగైతే కైసరువి కైసరుకును, దేవునివి దేవునికిని చెల్లించుడి” అని వారితో చెప్పాడు (మత్తయి 22:19-21). రోమా ప్రభుత్వమునకు చట్ట రీత్యా పన్ను చెలించవలసిన బాధ్యత గూర్చి వారడిగిన ప్రశ్నకు ఆయన వారికి సంపూర్ణమైన సమాధానమునిచ్చాడు. ఆయన చెప్పిన జవాబును విన్నవారు అందుకు “ఆశ్చర్యపడి” ఆయనను విడిచి వెళ్లిపోయారు (మత్తయి 22:22). మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేయు ఈర్ష్య మరియు ద్వేషము తప్ప మరేదియును ఇటువంటి ప్రతిస్పందనను తీసికొని వారు కైసరుకు పన్ను చెలించక వారియొద్దనే ఉంచుకొనవలెనని యేసు చెప్పాడను అర్థమిచ్చునట్లు ఆ మాటలకు రూపురేఖలు దిద్దారు. నేరము మోపుటకు తగిన రుజువు వారి దగ్గర ఏదియును లేకుండినది కాబట్టె వారు, ఆయన శత్రువులు ఆయనను గూర్చి ఈ అసత్యము చెప్పారు.

*పిలాతు యొక్క సావధానమును ఆకర్షింపజేయుటకు మరేదైనా దోషము దొరుకుతుందేమోనని ఇంకా తడుముకొంటూ, ఆయన ఒక రాజు అని యేసు స్వాధికారముతో*

*పలికాడనియు గనుక ఆయన రోమా సామ్రాజ్యమునకే ఒక బెదిరింపనియు అనుకోకుండానే వారు బయటపెట్టారు.* వారు, “ఇతడు ... తానే క్రీస్తును ఒక రాజనియు చెప్పగా మేము వింటిమి” అని అన్నారు (లూకా 23:2). ఈ నింద ఖచ్చితముగా పిలాతు వినికిడిలో ఒక గంభీరమైన నేరమై యుండెను. యేసు రోమా ప్రభుత్వమునకు ఒక బెదిరింపుగా ఉన్నాడని అగుపించునట్లు వారు ఏదో ఒకటి చేయక తప్పదని యూదులు ఎరిగియుండిరి, లేదంటే వారు ఆశించుచుండిన తీర్పు ఇవ్వబడే పరిస్థితులు వారికి కనబడలేదు. ఔను, యేసు, దేవుని కుమారుడు, రాజైయుండెను: ఆయన దేవుని ఆధ్యాత్మిక రాజ్యమునకు రాజై యుండెను. ఆయన కాలము సంపూర్ణమగువరకు ఏలును (1 కొరింథీయులకు 15:24). ఆయన పరిపాలన రోమా చక్రవర్తి యొక్క రాజకీయ ఆధిపత్యముతో గాని రోమా సామ్రాజ్యముతో గాని ఏ విధముగా నైనను ఘర్షణ పడలేదు, దానిని ఉల్లఘించలేదు.

అటు తరువాత, ఆయన యేసుతో వ్యక్తిగతముగా నిర్వహించిన ప్రశ్నోత్తర సమయములో, పిలాతు, “యూదుల రాజువు నీవేనా?” అని యేసును అడిగాడు (మత్తయి 27:11ఎ). అందుకు యేసు, “నీవన్నట్టే” అని పలికాడు (మత్తయి 27:11బి), కానీ ఆయన రాజ్యము ఇహలోక సంబంధమైనది కాదని యేసు వివరించాడు (యోహాను 18:36). ఆయన రాజ్యము రోమా సామ్రాజ్యము వలె ఇహలోక సంబంధమైన రాజ్యము కాదు: అది ఆధ్యాత్మీకమైనది, దేవుని చిత్తము మరియు దేవుని పరలోక ఉద్దేశములు దానిలో ఇమిడి యున్నవి' ఆయన రాజ్యము గూర్చి యేసు వివరించినది వినిన తరువాత, పిలాతు, “అతనియందు ఏ దోషమును నాకు కనబడలేదు” అని పలికాడు (యోహాను 18:38).

యేసు యొక్క నిర్దోషత్వము మరియు సత్యములో నుండి వెలువడిన వెలుగును భరించలేకపోయిన అవినీతిపరులైన న్యాయాధిపతులచేత క్రీస్తుకు విరోధముగా చేయబడిన అర్థంపర్థంలేని ఆరోపణలు వినిన తరువాత, యేసులో ఏ విధమైన దోషమును ఆయన కనుగొనలేదని పిలాతు ముమ్మారు ప్రకటించాడు (యోహాను 18:38; 19:4; 12). ఏది ఏమైనా, ఇంకొక్క సారి కలహము చెలరేగినట్లయితే లేక మరొక్క సారి అల్లరితో కూడిన పరిస్థితి ఏర్పడినప్పుడు దానిని అదుపు చేయలేకపోయినట్లయితే రోమా ప్రభుత్వము ఏమి చేయునో అనియు, వారు అనుకొన్నట్లు జరుగకపోయినట్లయితే ఈ ప్రధాన యాజకులును వారితో కూడ వచ్చిన జనసమూహమును ఏమి చేయునో అనియు పిలాతు ఈ రెండింటి నడుమ నలిగిపోతున్నాడు. చివరకు, పిలాతు భయము మరియు బలహీనత వలన వారివైపే మొగ్గాడు.

అలాగైతే, యేసు చేసిన నేరములేమిటి? ఏ కుటిల కార్యముల కొరకు యేసు సిలువవేయబడ్డాడు? దీనంతటిలో గల అసలు సత్యమేమనగా: యేసు, దైవత్వములోని రెండవ సభ్యుడు, దేవుడేమైయున్నాడో మనకు కనుపర్చుటకును, మనము మన పాపముల నుండి విమోచింపబడి సంరక్షింపబడునట్లు ఆయన ప్రణాళిక ప్రకారమైన రక్షణ మార్గమును మనకిచ్చుటకును, దేవుడు మన యెడల కలిగియున్న ఆయన ప్రేమ గూర్చి మనకు తెలియజెప్పుటకును, దేవుని ఆధ్యాత్మిక రాజ్యములోని భాగముగా జీవించునట్లు మనలను సిద్ధపరచుటకును, మనము నిరంతరము ఆయనతో కూడ జీవించుటకు సిద్ధముగా నుండునట్లు చూచుటకును శరీరధారియై వచ్చాడు. మహోన్నతమును పవిత్రమునైయున్న ఈ ఉద్దేశములు నేరములైనట్లయితే, వాస్తవము పూర్తిచేయబడనదై నిరర్థకమైనట్లే. యేసు

ఏ నేరము విషయములోనైనను దోషియై యుండినట్లయితే, సముద్రములో నీళ్లు లేనట్లే, వాతావరణములో గాలి లేనట్లే, విషయము లేనట్లే.

❖◆❖◆❖

*యేసు – పరిపూర్ణుడును, అసమానుడును, పాపరహితుడునైన – ఆయన, దేవుని కుమారుడు, ఈ లోకమునకు దేవుని ప్రేమను మరియు వెలుగును తెచ్చాడు కాబట్టి సిలువ వేయబడ్డాడు. మానవులు పాపము వలన అంధులై, యేసు ఇహమందు ఉండకూడదని కోరుచు ఆయన అనుగ్రహించిన దానిని అంగీకరించుటకు సమ్మతించలేదు.*